

గులాబీ శ్రేణుల్లో జోష్

- కేసీఆర్ రోడ్‌షోకు వేలాదిగా తరలివచ్చిన జనం
- సిరిసిల్లలో గులాబీ జెండా రెపరెపలు

సిరిసిల్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల గులాబీమయంగా మారిపోయింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు బస్సు యాత్ర శుక్రవారం రాత్రి సిరిసిల్లకు చేరుకుంది. కేసీఆర్‌కు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. భారీ జన సందోహన్ని చూసి కేసీఆర్ ఫిదా అయ్యారు. సాయంత్రం 6.50 నిమిషాలకు సిరిసిల్ల కొత్త చెరువు బండ్ వద్దకు బస్సు యాత్ర చేరుకుంది. ఒగ్గు కళాకారులు, బోనాలు, డప్పుచప్పుళ్లు, బతుకమ్మలు, కోలాటాలతో చేనేత చౌక్ వరకు రోడ్ షో నిర్వహించారు. దాదాపు వెయ్యి మంది కళాకారులు పాల్గొన్నారు. చేనేత చౌక్ వద్ద కళాకారుల బృందం అటపాటలతో అలరించారు. కేసీఆర్ రాత్రి 7.08 నిముషాలకు ప్రసంగాన్ని ప్రారంభించి కేవలం 15 నిముషాల్లోనే ప్రసంగాన్ని ముగించారు. బస్సు యాత్ర సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, జనాల్లో తిరుగుతూ పర్యవేక్షణ చేశారు. సిరిసిల్లలోని కొండ లక్ష్మణ్ బాపూజీ, తెలంగాణ తల్లి, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌరస్తాతో పాటు రోడ్ల వెంబడి తోరణాలలో అలంకరించారు. భారీ సంఖ్యలో వచ్చిన జనంతో గులాబీ నాయకుల్లో ఉత్సాహం నెలకొంది.

చివరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తా

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ రూరల్, మే10: తన చివరి శ్వాస వరకు ప్రజాసేవ చేస్తానని కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, శ్రీపురం కాలనీ, నగునూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఏడు లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజల నెత్తిపై భారం మోపిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వినోద్‌కుమార్, బండి సంజయ్ కుమార్ ఏమీ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తన తండ్రి ఆశయ సాధన కోసం పేద ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడతానని అన్నారు. సీతారామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ పెంచాల లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, కూర నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

నరేంద్ర మోదీని మళ్లీ ప్రధానిని చేయాలి



సిరిసిల్లలో ప్రచారం నిర్వహిస్తున్న బండి సంజయ్

వేములవాడ, మే 10: నరేంద్ర మోదీని మళ్లీ ప్రధానిని చేసేందుకు బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. శుక్రవారం వేములవాడలో నిర్వహించిన బీజేపీ నియోజకవర్గస్థాయి పోలింగ్ బూత్ ఏజెంట్ల సమావేశానికి బండి సంజయ్ హాజరై మాట్లాడారు ఈనెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో ప్రజలంతా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, చెన్నమనేని వికాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, మార్త సత్తయ్య, బండ మల్లేశం పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ సిరిసిల్ల పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పట్టణంలో గాంధీ చౌక్‌నుంచి పెద్దబజార్ మీదుగా పాతబస్టాండ్ వరకు ఇంటింటితోపాటు దుకాణాల్లో తిరుగుతూ బీజేపీ ఓటు వేయాలని కోరారు.

లోక్‌సభ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా

సోషల్ ఆడిటింగ్

శంకరపట్నం, మే 10: ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిటింగ్ ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం శంకరపట్నం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈజీఎస్ పనులకు సంబంధించి ఆడిట్ చేసిన నివేదికను గ్రామాల వారీగా ప్రజావేదిక కార్యక్రమంలో అధికారుల ముందు చదివి వినిపించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, అడిషనల్ డీఆర్డీవో సంధ్యారాణి, ఎంపీడీవో శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

వీర్నపల్లి, మే 10: వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసుపై శుక్రవారం విచారణ చేపట్టారు. ఆదర్శ పాఠశాలలోని సమస్యలపై అడిగిన కొనరావుపేట మండలానికి చెందిన హరీష్‌ను పాఠశాల ప్రిన్సిపల్ విశ్వనాథం కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో ఇరువర్గాల నుంచి పూర్తి సమాచారం సేకరించారు. పాఠశాలకు వచ్చి సమస్యలపై కాకుండా బెదిరించి డబ్బులు అడిగారని పాఠశాల ప్రిన్సిపల్ విశ్వనాథం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హరీష్ అనే వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ఎన్నికలు ముగిసిన వెంటనే

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్

జగిత్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఎన్నికలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల శ్యాం సుందర్, ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అక్టోబర్ మాసంలో బదిలీ అయి రిలీవ్ చేయని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని అన్నారు. బకాయి ఉన్న నాలుగు వాయిదాల డీఏను విడుదల చేయాలని, ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, మోడల్ స్కూల్స్‌లను విద్యా శాఖ పరిధిలోకి తీసుకొని రావాలన్నారు. గురుకులాలు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవుల్లోనే ముగించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యా వలంటీర్లను, పారిశుధ్య కార్మికులను, అటెండర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు తగిన మౌళిక వసతులు కల్పించాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఒకే విధమైన ఎన్నికల పారితోషికం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యాంసుందర్

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై

బండి సంజయ్‌కు నోటీసులు

కరీంనగర్ అర్బన్, మే 10 : కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌కు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్‌కుమార్ జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు పట్ల వివరణ కోరుతూ శుక్రవారం ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 11న ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్ ఎదుట విచారణకు హాజరుకావాలని బండి సంజయ్‌కుమార్‌కు ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘన

బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్‌పై కేసు నమోదు

జగిత్యాల టౌన్, మే 10 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘనలో నిజామాబాద్ ఎంపీ, ప్రస్తుత బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్‌పై జగిత్యాల పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జగిత్యాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 8న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని ఉద్దేశించి హిందువులకు జీవన్ రెడ్డి ప్రమాదకంగా మారాడు, పీఎఫ్ఐ ఉగ్రవాదుల పార్టీకి జగిత్యాల అడ్డాగా మారిందంటూ అర్వింద్ ఎన్నికల నియమావళి నిబంధనలకు విరుద్ధంగా మాట్లాడారు. అంతే కాకుండా మత విద్వేశాలు రెచ్చగొట్టే విధంగా ప్రత్యర్థి అయిన జీవన్ రెడ్డికి వ్యతిరేఖంగా మాట్లాడుతూ అర్వింద్ నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగతంగా దూషణలు చేశాడు. జగిత్యాల అర్బన్, రూరల్ మండల ఎన్నికల ఎఫ్ఎస్‌టీ-5 ఇన్‌చార్జి మాదారపు విజయేందర్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్వింద్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి

కోనరావుపేట, మే 10: కోనరావు పేట మండలం నిమ్మపల్లి గ్రామా నికి చెందిన శతాధిక వృద్ధుడు విక్రుతి నర్సయ్య(104) శుక్రవారం మృతి చెందాడు. నర్సయ్య తనపని తాను చేసుకుంటూ ఇన్ని రోజులు ఆరోగ్యంగా ఉన్నాడు. వారం రోజులుగా ఆరోగ్యం క్షీణించి మృతి చెందాడు. వృద్ధుడు నర్సయ్యకు భార్య నర్సవ్వ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా పెద్ద కొడుకు నర్సయ్య గత సంవత్సరం మృతి చెందాడు.


నర్సయ్య(ఫైల్)

జగిత్యాలలో తనిఖీలు

జగిత్యాల టౌన్, మే 10 : జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద రూ. 1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు పట్టుకుని జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు నరేష్ , మన్మథరావు తదితరులు ఉన్నారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు

ధర్మపురి, మే 10: ధర్మపురి క్షేత్రంలో అక్షయ తృతీయ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళలో స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ దేవాలయాల్లో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్యులు, అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో ఏటా నిర్వహించే విధంగా లోక క్షేమార్థం నరసింహ ఉపాసకులు, హైదరాబాద్ శ్రీనిఖిల్ చేతన కేంద్రం వ్యవస్థాపకులు శ్రీ సద్గురు అనిల్ కుమార్ జోషీ ఆధ్వర్యంలో శిష్య బృందం జ్వాల లక్ష్మీ నరసింహ మూల మంత్ర హవనం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేక మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. సాయంత్రం వేళలో పొన్న చెట్టు సేవ ఆలయం చుట్టు ప్రదక్షిణం నిర్వహించారు. భక్తులకు సమస్యల నివారణ కోసం సాధన మార్గాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది శిష్యులు పాల్గొన్నారు.


నరసింహుడి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే 10: మండలంలోని సత్తక్కపల్లి గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో బాగంగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వాహకులు ఘనంగా జరిపారు. శుక్రవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం పురోహితుల వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి కల్యాణం కన్నుల పండుగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు స్థానికులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

మైలారం మల్లన్న ఆలయంలో చోరీ

తంగళ్లపల్లి, మే 10: తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలో మైలారం మల్లన్న దేవాలయంలో చోరీ జరిగింది. గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు దేవాలయం తాళాలు పగలగొట్టి దేవాలయంలోని రూ 20 వేల విలువైన రెండు ఇత్తడి గంటలు, ఇత్తడి మల్లన్న విగ్రహాలను ఎత్తుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ధర్మారం,మే10: ధర్మారం మండల కేంద్రంలో గల సాయిమణికంఠ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి ఆటో బోల్తాపడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిలి బక్కయ్య(62) కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. గురువారం రాత్రి ధర్మారంలో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభకు వచ్చిన ఐదుగురు ఆటోలో తిరిగి వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జంగిలి బక్కయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆటోను అతి వేగంగా నడిపిన డ్రైవర్ పోతు లచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, మే 10: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట బైపాస్ రోడ్డులో ద్విచక్రవాహనంపై నుండి పడి సంపత్(28) అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్ శివారులోని చింతకుంట గ్రామానికి చెందిన సంపత్ సిరిసిల్లలోని ఓ ఫైనాన్స్ సంస్థలో సెల్స్ మెన్‌గా పనిచేస్తుంటాడు. ఇతను విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై సిరిసిల్ల నుంచి కరీంనగర్‌కు వెళుతుండగా రోడ్డుపై వడ్లు ఆరబోసేందుకు అడ్డంగా పెట్టిన రాళ్లు తగిలి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సంపత్ తలకు బలంగా దెబ్బలు తగలడంతో తీవ్రమైన రక్తస్రావం అయింది. ఈ ప్రమాదం శబ్దం విన్న చంద్రంపేటకు చెందిన యువకులు రోడ్డుపై రక్తపు మడుగులో పడిపోయి కొట్టుమిట్టాడుతున్న సంపత్‌ను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించి సెల్‌ఫోన్ ఆధారంగా అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆ యువకుడి పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌కు తరలించారు. బైపాస్ రోడ్డులో వీధి దీపాలు లేకపోవడంతో చీకట్లు కమ్ముకున్నాయి. మరోవైపు ఒకే సైడ్ రోడ్డునుంచి రాకపోకలు సాగడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో వీధిదీపాలు ఏర్పాటుచేసి రెండువైపుల రాకపోకలను సాగేలా రోడ్డును మరమ్మత్తుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

చందుర్తి, మే 10: చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో జోగాపూర్ గ్రామం చెందిన ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం జోగాపూర్ గ్రామంకు చెందిన భైరి శేషాద్రి వేములవాడ నుండి స్వగ్రామమైన జోగాపూర్ గ్రామానికి బైక్‌పై వెళుతుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో శేషాద్రికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరుపుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పోలీసు కస్టడీకి

తప్పుడు రిజిస్ట్రేషన్ కేసు నిందితులు

కరీంనగర్ క్రైం, మే 10: అప్పు తీసుకుని తిరిగి ఇవ్వకపోగా, ఆ డబ్బులకు వేరొకరికి చెందిన ఇంటి స్థలాన్ని అసలు యజమానికి బదులుగా తప్పుడు వ్యక్తితో రిజిస్ట్రేషన్ చేసిన కేసులో నిందితులు దేవసాని శ్రావణ్‌కుమార్, పోరండ్ల శ్రీనివాస్ లను కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్ కుమార్ శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో ఈ నెల 4వ తేదీన నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కాగా ఈ కేసుకు సంబందించిన మరింత కీలక సమాచారం సేకరించేందుకు నిందితు లిద్దరిని శుక్రవారం ఉదయం 11 నుంచి శనివారం ఉదయం 11 గంటల వరకు పోలీస్ కస్టడీ లోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఇల్లందకుంట, మే 10: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన మేకల తిరుపతి, రమ, సతీష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన సౌమ్యజకు దళితబంధు పథకంలో రూ. 10లక్షలు మంజూరయ్యాయి. ఆమెకు సెట్రింగ్ కొటేషన్ ఇప్పిస్తాన ని గతంలో చాలా మందికి ఇప్పించానని, శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన మేకల తిరుపతి హైద్రాబాద్‌కు చెందిన సాయి బాలాజీ ట్రేడర్స్‌కు దళితబంధు పథకంలోని డబ్బులు రూ. 5లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించారు. ఆ డబ్బులు సౌమజ్యకు ఇవ్వకుండా తిరుపతి తన భార్యకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. తనను మోసం చేశారని సౌమ్యజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి, రమ, సతీష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం స్వాధీనం

తిమ్మాపూర్, మే10: మండలంలోని రేణికుంట వద్ద రాజీవ్ రహదారిపై పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం రాత్రి హైదారాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న కారు(ఏపీ09 ఏజె 1128)లో గులాబీ రంగు పకిడి రుమాల్ టోపీ క్లాత్‌లు 750 వరకు గుర్తించి వాహనం స్వాధీనం చేసుకున్నామని ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు. ఇవి బీఆర్ఎస్ పార్టీ రోడ్ షో కార్యక్రమంకు తీసుకుపోతున్నరని గుర్తించిన పోలీసులు, తరలిస్తున్న కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు మహమ్మద్ కరీముద్దీన్, అబ్దుల్ సలాం, సయ్యద్ ఫయాజ్ హుస్సైన్ లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

బెల్ట్‌షాప్‌లో మద్యం పట్టివేత

మల్యాల, మే 10: మండలంలోని లంబాడిపల్లిలో గల బెల్ట్‌షాప్‌లో మద్యం పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. బల్యం గంగమహేష్ అనే వ్యక్తి బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు చేసి 17లీటర్ల రాయల్‌స్టాగ్ మద్యం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

రాజక్కపల్లిలో..

వెల్గటూర్, మే 10: మండలం లోని రాజక్కపల్లిలో శుక్రవారం రాత్రి మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేంధర్ సింగ్ తెలిపారు. మద్యం తరలిస్తున్న మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసుల తనిఖీల్లో నగదు పట్టివేత


పట్టుకున్న నగదును చూపుతున్న సీఐ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, మే 10: నగరంలోని ఐబీ చౌరస్తా వద్ద కరీంనగర్ రెండో టౌన్ పోలీసులు శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 18 లక్షల 75 వేల 651 రూపాయలు నగదును పట్టుకున్నారు. సరైనా ఆధారాలు, రశీదులు లేకుండా డబ్బులు తరలిస్తుండగా పట్టుకున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. రామడుగు మండలం గుండి గ్రామానికి చెందిన గమ్మడి రమేష్ సరైన ఆధారాలు చూపకుండా రూ. 6 లక్షల నగదు కలిగి ఉండగా పట్టుకున్నామని తెలిపారు. అలాగే మానకొండూర్ మండలం ఊటూరు గ్రామానికి చెందిన పడాల హరీష్ వద్ద 12 లక్షల 75 వేల 651 రూపాయలు పట్టుబడ్డాయని తెలిపారు. పట్టుబడిన మొత్తం నగదు 18,75,651ను తదుపరి ప్రక్రియ నిమిత్తం సంబంధిత ఎన్నికల అధికారులకు స్వాధీనం చేశామని సీఐ తెలిపారు. కాగా టవర్ సర్కిల్ వద్ద కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన అలగం కుమారస్వామి వద్ద 88 వేల రూపాయలను పట్టుకున్నారు. పట్టుబడిన డబ్బును తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారుల వద్దకు తరలించామని పోలీసులు తెలిపారు.

రాజస్వామి సేవలు మరువలేనివి

కరీంనగర్ టౌన్, మే 10: డీటీఎఫ్ ఉమ్మడి జిల్లాశాఖ కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిలర్‌గా పనిచేసిన చీర్ల రాజస్వామి డిసిఇబి సెక్రటరీగా, రిటైర్డు హెడ్మాస్టర్‌గా చేసిన సేవలు మరువలేనివని డిటిఎఫ్ శ్రేణులు పేర్కొన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందిన రాజస్వామి అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా ఆయన భౌతికకాయాన్ని డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టి.లింగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అటుకుల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం.రఘుశంకర్‌రెడ్డి, కె. నారాయణరెడ్డి, రాష్ట్ర పూర్వ కార్యదర్శి కోహెడ చంద్రమౌళి, రాష్ట్ర పూర్వ ఆడిట్ కమిటీ కన్వీనర్ డి.ఏసురెడ్డి, కరీంనగర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి, ఎ.తిరుపతి, వివిధ జిల్లాల బాధ్యులు, రాష్ట్ర కౌన్సిలర్లు, మండల బాధ్యులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, బంధువులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు సందర్శించి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

రూ.7,100 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మే 10: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటాల్ పత్తి ధర 7,100 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 73క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,100, కనిష్ఠ ధర 6,860 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శని, ఆదివారాలు సాధారణ సెలవులు ఉంటాయి. కాగా సోమవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సెలవు ప్రకటించారు. దీంతో మంగళవారం నుంచి పత్తి కొనుగోళ్లు కొనసాగనున్నాయి.

విద్యార్థులకు అభినందన

చొప్పదండి, మే 10: మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు యూపీఎస్‌ఈ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌డీఏ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటడంతో శుక్రవారం పలువురు అభినందిచారు. ఇటీవల నిర్వహించిన ఎన్‌డీఏ పరీక్షలో వి అభిలాష్, ఆర్ సిద్ధార్థ్, జి వినయ్‌కుమార్, జె నరసింహులు, ఎం విష్ణువర్ధన్‌లు ప్రవేశ పరీక్షకు హాజరై ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. కాగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సెక్రెటరీ సీతాలక్ష్మి, డైరెక్టర్ కెసి రావు, ప్రిన్సిపాల్ లచ్చయ్య, ఓఎస్‌డి పిఎస్ శర్మలు అభినందించారు.

‘రిజర్వేషన్ల జోలికి వస్తే తరిమికొడుతాం’

సుభాష్‌నగర్, మే 10: రాజ్యాంగం జోలికి వస్తే తరిమి కొడతామని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్ అన్నారు. శుక్రవారం నగరంలో తళిత సంఘాల ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. . సమావేశంలో మాదిగ సంఘం నాయకుడు సంపతి అశోక్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆనాయకుడు సాంబారి కొమురయ్య, దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు కంసాల శ్రీనివాస్, ఈశరి జస్వంత్, క్యాదాసి ప్రభార్, భీమారం సతీష్, నీరుకుల్లా అనిల్, వంతడుపుల సంపత్, నిజాంపేట శ్రీనివాస్, కనుమల్ల శ్రీనివాస్, బుర్ర సోమయ్య, తాటిపల్లి ప్రభు, దరిపల్లి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్యపై దాడి హేయమైన చర్య

గణేశ్‌నగర్,మే 10: బీసీ సంక్షేమ, యువజన, మహిళా సంఘం ఆధ్వర్యంలో బీసీ ఉద్యమ నేత ఆర్ కృష్ణయ్యపై జరిగిన దాడిని ఖండిస్తూ నగరంలోని బైపాస్ రోడ్డు ఎన్టీఆర్ విగ్రహం దగ్గర బీసీ సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసిపెద్ది శ్రీధర్ రాజు, సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పటేల్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, మహిళా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గున్నాల కన్నాంబ, జిల్లా కన్వీనర్ మియాపురం రవీంద్రచారి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో పడి ఒకరి మృతి


రమేశ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 10: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో రెండు రోజుల కిందట అదృశ్యమైన భవన నిర్మాణ కార్మికుడు గడ్డి రమేశ్ (42) ప్రమాద వశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ రమాకాంత్ కథనం మేరకు.. గ్రామంలోని రమేశ్ భవన నిర్మాణ కార్మికుడిగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఈ నెల 8న పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన అతడు తిరిగి సాయంత్రం బయటకు వెళ్లాడు. మద్యం తాగి ఇంటికి వస్తున్న క్రమంలో దారి పక్కన ఉన్న ఓ వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడ్డాడు. చీకటి పడినా రమేశ్ ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు గాలించారు. ఆచూకీ తెలియరాలేదు. అనుమానం వచ్చి శుక్రవారం ఉదయం ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో చూడగా రమేశ్ మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చేరుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని స్థానికులు సహాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. కుటుంబ పెద్ద విగత జీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీటీసీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ సుభాష్, మాజీ సర్పంచ్ రవీందర్ కోరారు.

ట్రైనీ కానిస్టేబుళ్లకు ఎన్నికల విధులపై శిక్షణ


మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, మే 10: ఎన్నికల విధుల గురించి ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పలు కీలక సూచనలు చేశారు. ఈ మేరకు శుక్రవారం రాంనగర్‌లోని పోలీస్ ట్రైనింగ్ కళాశాల (పీటీసీ), కరీంనగర్ బైపాస్‌లోని కమిషనరేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్(సీపీటీసీ)లో ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు ఎన్నికల రోజు నిర్వహించే విధుల గురించి సీపీ పలు కీలక సూచనలు చేసారు. ఎన్నికలరోజు ముందు రోజు ఆదివారం రోజున ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సామాగ్రిని, ఈవీఎంలను స్వీకరించిన తరువాత వాటికి భద్రతగా వారితో పాటు, కేటాయించిన పోలింగ్ లోకేషన్, కేంద్రాన్ని తెలుసుకుని వారి వెంటే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నప్పటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని సూచించారు. పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్ణయించబడినప్పటికీ పోలింగ్ రోజున ఉదయం 6 గంటలకే విధులకు హాజరై సంసిద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ రోజున ఓటర్లను క్యూ పద్ధతిలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చే మహిళలు, వృద్ధులతోపాటు అన్ని వర్గాల ప్రజలతో సత్ప్రవర్తనతో మెదలాలన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రం వద్ద శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి వాటిని నివారించేందుకు రూట్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులను కేటాయిం చామని, అయా అధికారుల ఫోన్ నంబర్లను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని, సమస్యలు తలెత్తితే వెంటనే వారికి తెలపాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే ఎట్టిపరిస్థితుల్లో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లరాదని, వారు పిలిస్తేనే వెళ్లాలని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వుంటూ ఎన్నికలు ప్రశాంతగా ముగిసేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రినిసిపాల్ శ్రీనివాస్‌తో పాటు కమిషనరేట్ పోలీస్ సెంటర్ ప్రిన్సిపల్ ఏ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ రవినాయక్

సుభాష్‌నగర్/తిమ్మాపూర్, మే 10: అన్ని ప్రైవేటు ఆసుపత్రులు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ డాక్టర్ రవినాయక్ అన్నారు. శుక్రవారం తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు రిజిస్ట్రేషన్‌తో పాటు ఫైర్ సేఫ్టీ, వసతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆడిట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీటీసీవో డాక్టర్ కెవీ రవీందర్‌రెడ్డి, డిఐవో డాక్టర్ సాజిదాఅతహరి, పివో డిటిటి డాక్టర్ రాజగోపాల్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జువైరియా, ఎంసీహెచ్ పీవో డాక్టర్ సనాజువేరియా, రంగారెడ్డి, కాంతారావు, డాక్టర్ శిల్పారెడ్డి, తులసి రవిందర్ పాల్గొన్నారు.

రూ.30 వేల విలువైన
మద్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 10: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పదిర గ్రామంలోని బెల్టు షాపు, ఓ రాజకీయ పార్టీ నాయకుడి ఇంటిలో మద్యం నిల్వ చేశారనే సమాచారంతో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఓ రాజకీయ పార్టీ నాయకుడు ఓటర్లకు మద్యం పంచేందుకు తీసుకు వచ్చి అక్రమంగా నిల్వ చేసిన రూ.30 వేల విలువైన మద్యం సీసాలను స్వాధీన పర్చుకున్నారు. మద్యం సీసాలను ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. పదిరలో ఎన్నికల నేపథ్యంలో బెల్టు దుకాణంలో నిల్వ చేసి ఒక్కో బీరు సీసాకు రూ.40 అధనంగా విక్రయిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ వివరించారు.

తడిసిన ధాన్యం

- కొనుగోళ్లు జరుగుతుండగానే కుండపోత వర్షం
- ఆందోళనలో అన్నదాతలు


కథలాపూర్‌లో తడిసిపోయిన ధాన్యం

కథలాపూర్, మే 10: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షం కారణంగా వరి ధాన్యం పూర్తిగా తడిసి పోయింది. భూషణరావుపేట, కథలాపూర్, దుంపెట, చింతకుంట, పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల్లోని సెర్ప్, ప్యాక్స్ కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్న క్రమంలోనే అనూహ్యంగా వర్షం కురవడంతో సంచులన్నీ తడిసిపోయాయి. నెల రోజులుగా కేంద్రాల్లో కొనుగోళ్ల కోసం వేచి చూస్తున్న రైతులకు ఒక్కసారిగా కురిసిన వర్షం వల్ల తీవ్ర నష్టం వాటిల్లనుంది. సుమారు అరగంట సేపు కుండపోత వాన కురిసి వడ్ల సంచులన్నీ తడిసాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వరుసగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కాగా కేంద్రాల నిర్వాహకులు టార్పాలిన్లు నిల్వ ఉంచకపోవడం వల్ల ధాన్యం తడిచిపోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఈదురు గాలులకు పలు చోట్ల మామిడి కాయలు రాలిపోయాయి.

చెత్త కుప్పలో పసికందు మృతదేహం

హుజూరాబాద్, మే 10: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగుదొడ్ల వెనుక భాగంలోని చెత్తకుప్పలో పసికందు మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మరుగుదొడ్ల పక్కన చెత్తకుప్పల నుంచి దుర్వాసన రావడంతో బస్టాండులోని దుకాణాదారులు అక్కడికి వెళ్లి చూశారు. అక్కడ పసికందు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకి చేరుకుని పరిశీలించారు. పసికందును రెండు రోజుల క్రితం అక్కడ పడవేసినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

గంగాధర, మే 10: గంగాధర మండలం మంగపేట శివారులో బావిలో పడి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివారల ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తుర్కకాశీనగర్‌కు చెందిన కరీమా(27) అనే వివాహిత శుక్రవారం గంగాధర మండలం మంగపేట శివారులోని బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. వివాహిత బావిలోకి దూకిన విషయం తెలుకున్న స్థానిక యువత రక్షించడానికి ప్రయత్నించారు. అప్పటికే చనిపోయి నీటిలో మునిగి పోయింది. సమాచారం మేరకు ఎస్‌ఐ కిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చేరుకుని బావిలోని నీటిని తోడి మృతదేహాన్ని తీయడానికి ప్రయత్నిస్తున్నారు. మహిళకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

సుల్తానాబాద్, మే 10: సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండయ్య కాలనీకి చెందిన చింతల రాజు(19) అనుమానాస్ప ద స్థితిలో శుక్రవారం మృతిచెందాడు. గురువారం రాత్రి మిత్రులతో కలిసి ఉన్నవాడు మరునాడు మధ్యాహ్నాం బావిలో శవమై తేలాడు. రాజు ఆత్మహత్యకు పాల్పడ్డాడా, లేక ఎవరైనా చంపి బావిలో పడవేశారా అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు, కాలనీ వాసుల కథనం ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండయ్య కాలనీకి చెందిన చింతల శ్రీనివాస్ పెద్ద కుమారుడు చింతల రాజు గురువారం రాత్రి మిత్రులతో కలిసి తిరిగాడు. కానీ ఆరోజు ఇంటికి రాలేదు. అతని మిత్రుడు ఒకరు రాజు సెల్‌ఫోన్ మరిచిపోయాడు అంటూ వారి ఇంటికి తెచ్చిఇచ్చి వెళ్లిపోయాడు. దాంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు, బంధువులు అతడి జాడ కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. రైల్వే గేట్ సమీపంలో ఉన్న బావికి కొద్ది దూరంలో రాజు బైక్ ఉండగా, బావి వద్ద చెప్పులు ఉన్నాయి. దాంతో అనుమానం వచ్చి బావిలో వెతకగా మృతదేహం లభ్యమయింది. మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గడ్డివాము దగ్ధం

చిగురుమామిడి, మే 10: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో కత్తుల దేవేందర్ అనే రైతు వ్యవసాయ బావి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ బాక్సులు కొట్టివేయడంతో మంటలు చెలరేగి సమీపంలోని 15 ట్రిప్పుల గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. సమీపంలో పశువులు ఉండడంతో వేడి తీవ్రతకు లేగదూడ మృతిచెందింది. మిగతా పశువుల తాళ్లను దేవేందర్ తొలగించడంతో పమాదం నుంచి బయటపడ్డాయి. సుమారు 300 గడ్డికట్టలు కాలిపోవడంతో తీవ్రనష్టం వాటిల్లిందని బాధితుడు దేవేందర్ తెలిపాడు.

ధాన్యం రవాణాకు లారీల కొరత

- సంచికి రూ.1-2 ఇస్తేనే వస్తున్న లారీలు
- నత్తనడకన కొనుగోళ్లు
- ఇబ్బందులు పడుతున్న రైతులు


కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

మల్యాల, మే 10: వరి ధాన్యం తరలించేందుకు గాను లారీల కృత్రిమ కొరతతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదనపు తూకం, అదనపు వసూళ్లతో ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తుండగా నాణ్యత ప్రమాణాల పేరిట ధాన్యం త్వరితగతిన తరలించకపోగా తూకం వేసిన ధాన్యం తరలించడానికి లారీల కొరత ఏర్పడుతోంది. రోజుల తరబడి తూకం కోసం ఎదురుచూపులు, అకాల వర్షాల నేపథ్యంలో ఇంకా కొనుగోలు కేంద్రాలలోనే ఉంటే నష్టపోవాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. తూకం వేసిన ధాన్యం త్వరితగతిన తరలించాలంటే సంచికి రూ.1నుంచి 2 చెల్లిస్తేనే లారీలు అందుబాటులో ఉంటున్నాయని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఆ డబ్బులు చెల్లించకపోతే లారీలు రావడం లేదని అంటున్నారు.

● కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి కావాల్సి ఉండగా ధాన్యం తరలింపునకు లారీలు రాకపోవడం, అకాల వర్షాలతో రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలలో పడి గాపులు పడుతున్నారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాలలో దాదాపుగా 5వేల తూకం వేసిన సంచులు తరలించడానికి ఉన్నాయి. తమ ధాన్యానికి మాశ్చరు వచ్చి అనేక రోజులు గడుస్తున్నప్పటికీ తూకం మాత్రం వేయడం లేదని అకాల వర్షాలు కలవరపెడుతున్నాయని మరి కొందరు రైతులు చెబుతున్నారు. లారీలు కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా మని రైతులు ఆందోళన చెందవద్దని ఐకేపీ ఏపీఎం రాజయ్య తెలిపారు.

● కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా..

లారీల కొరత, ధాన్యం అదనపు తూకంపై సివిల్‌సప్లై కమిషనర్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. లారీల సమస్య తీర్చాలని స్థానిక సివిల్‌సప్లై అధికారులను కమిషనర్ ఆదేశించినప్పటికీ ఇంకా లారీల కొరత అలాగే ఉందని పైగా డబ్బులు చెల్లిస్తేనే త్వరగా వస్తున్నామని అంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.


రవాణా కోసం సిద్ధంగా ఉన్న సంచులు

బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట/వేములవాడ టౌన్ మే 10: బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తారని, బీజేపీ నాయకులు దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలంలోని మంగళపల్లి, సుద్దాల, పల్లిమక్త, నాగారం, వేములవాడ మండలంలోని మారుపాక, చంద్రగిరి, గుర్రంవానిపల్లి, కొడుముంజ, చింతలఠాణ గ్రామాల్లో తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని పక్కకు పెట్టినట్లే బీజేపీని కూడా పక్కన పెట్టాలని అన్నారు. గతంలో గెలిచిన వ్యక్తులు ఎవరైనా గ్రామాలకు వచ్చారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ గెలిచిన నాలుగున్నర నెలల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నాయకులు మాట్లాడడం బాధాకరమన్నారు. అంతేకాకుండా రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ నాయకులు చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును చేతి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

● వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. పట్టణంలోని ఆది శ్రీనివాస్ నివాసానికి విచ్చేసిన నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో రాజేశం, జీవన్, శ్రీనివాస్, పవన్ తదితరులు ఉన్నారు.

సిరిసిల్ల రూరల్/రుద్రంగి: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్, సర్దాపూర్, పెద్దబోనాల, చంద్రంపేట గ్రామాల్లో, రుద్రంగి మండల కేంద్రంలో కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూరదేవరాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, రుద్రంగి జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్ పాల్గొన్నారు.



సుద్దాలలో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఆది శ్రీనివాస్

వీర్నపల్లి: మండల కేంద్రములో యువత అనే అంశం పైన యువ కాంగ్రెస్ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బూత శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల మండల ఇంచార్జి మాలోతు రాంచందర్‌నాయక్ ఉన్నారు.

రుద్రంగి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి జరుగుతుందని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రుద్రంగి మండలం మానాలలో శుక్రవారం ఉపాధి హామీ కూలీల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దు

బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా బీజేపీ నాయకుల ఇంటింటికి ప్రచారం

ఇల్లంతకుంట, మే 10: కాంగ్రెస్ నాయకుల మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మవద్దని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఇల్లంతకుంట, వల్లంపట్ల, కందికట్కూర్ తదితర గ్రామాలలో శుక్రవారం ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఏకమయ్యాయని విమర్శించారు. బీజేపీతోనే అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తిప్పారపు శ్రావణ్, మామిడి హరీష్, చంద్రం తదితరులు పాల్గొన్నారు..

కోనరావుపేట: ప్రజలు మోదీ ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాడి సురేందర్‌రావు అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల్లో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌ని గెలిపించాలని శుక్రవారం ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ చేసిన అభివృద్ధి పనులను సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ని పువ్వు గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో బీజేపీ నాయకులు గొట్టె రామచంద్రం, మిర్యాల్‌కార్ బాలాజీ, వెలిశాల రవి, మోత్కు మోహన్, బెంద్రే శ్రీనివాస్, జిన్న అనిల్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, గొల్లపల్లి, బొప్పాపూర్, అల్మాస్‌పూర్, గుండారం, తిమ్మాపూర్, అక్కపల్లి, రాగట్లపల్లి, బండలింగంపల్లి, కోరుట్లపేట తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళ నాయకులు బొట్టు పెడుతూ బీజేపీకి ఓటు



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బండి సంజయ్

వేయాలని అభ్యర్థించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గారెడ్డి, రామచంద్రారెడ్డి, గణేశ్, శ్రీశైలం, లక్ష్మారెడ్డి, రవి, బాపురెడ్డి, పూర్ణిమ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీలో చేరిన మాజీ సర్పంచ్

చందుర్తి: చందుర్తి మండల కొత్తపేట తాజా మాజీ సర్పంచ్ పిట్టల లాస్యప్రసాద్ బీజేపీలో శుక్రవారం చేరారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలోకి చేరగా ఎంపీ బండి సంజయ్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మార్త సత్తయ్య, సిరికొండ శ్రీనివాస్, పొంచెట్టి రాకేష్, చిర్రం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వహణ

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

సిరిసిల్ల కలెక్టరేట్, మే 10: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధానఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు లోక్‌సభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి అదనపు కలెక్టర్‌లు ఖీమ్యా నాయక్, పి గౌతమి లతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ పోస్టల్ ఓట్ల నమోదు సంబంధిత సమాచారం వివిధ రాజకీయ పక్షాలకు తెలియజేయాలని, పోస్టల్ బ్యాలెట్‌లను పార్లమెంటు నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రాల స్ట్రాంగ్ రూములకు కట్టుదిట్టంగా తరలించి భద్రపర్చాలన్నారు. ఎన్నికల ప్రచార గడువు ముగిసిన తరువాత ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బంది అవసరమైన వసతులు కల్పించాలని, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, పోలింగ్ బృందాలకు పోలింగ్ సామగ్రి అందజేసి వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు మే 12వ తేది సాయంత్రం నాటికి చేరుకోవాలని అన్నారు. ఎన్నికలకు సంబంధించిన నివేదికలను సకాలంలో సమర్థవంతంగా సమర్పించాలని, రిపోర్టింగ్ సమయంలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వవద్దని అన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలిపించాలి



గజసింగవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేటీఆర్

గంభీరావుపేట, మే 10: కరీంనగర్ ఎంపీగా విద్యావంతుడైన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రజలను కోరారు. ఎల్లారెడ్డిపేట మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కేటీఆర్ గంభీరావుపేట మండలం గజసింగవరంలోని నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానికులతో కొద్దిసేపు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలన్నారు. ఐదేళ్ల పాటు అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కేటీఆర్ కోరారు.

బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం

ఇల్లంతకుంట/కోనారావుపేట/వేములవాడ రూరల్ మే 10: మండలంలోని కందికట్కూర్, పెద్దలింగాపూర్, ఇల్లంతకుంట, కోనరావుపేట, వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చింతపల్లి వేణురావు, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, కోనారావుపేట ఎంపీపీ చంద్రయ్యగౌడ్, వేములవాడ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో సస్పెన్షన్

ఇల్లంతకుంట, మే 10: ఎన్నికల నిబంధనలు అతిక్రమించాడని మండల ఇన్‌చార్జి ఎంఈవో బూక్య బన్నాజీని సస్పెండ్ చేస్తున్నట్లు ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు ఈ నెల 2న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతరం ప్రజాప్రతినిధులు ఎంఈఓను సన్మానించారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు వెళ్లింది. దీంతో మోడల్ కోడ్ ఆఫ్‌కండక్ట్‌ను ఉల్లంఘించారని ధ్రువీకరించి ఎంఈవోను సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు వచ్చాయి.

శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

- జిల్లాలో 1500మంది పోలీస్ బలగాలతో బందోబస్తు

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మే 10: శాంతియుత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సిద్ధమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధివిధానాలు, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై జిల్లాలోని సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, పోలీస్ అధికారులతో శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట సమీపంలో గల ఓ కళ్యాణమండపంలో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లాలో 1500మంది పోలీస్ బలగాలతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెండు రోజుల ముందే పకడ్బందీ ప్రణాళికతో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ఏదైనా సంఘటనలు జరిగితే స్పందించేందకు అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసిన తర్వాత ఈవీఎంలు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వరకు తరలించేందుకు రూట్ మొబైల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు నియోజకవర్గంలో ఉండడానికి వీలు లేదని, ఇందుకు రెస్టారెంట్స్, లాడ్జిలను తనిఖీ చేయాలన్నారు. డైనమిక్ చెక్ పోస్టుల ద్వారా జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి, మురళీకృష్ణ, సర్వర్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

● నేటి నుంచి 144 సెక్షన్ అమలు

ప్రజలు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని కొత్తచెరువు కట్ట నుంచి రాళ్లబావి, పెద్ద బజార్, గాంధీనగర్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు కేంద్ర పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ప్రజలు



సిరిసిల్లలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఓటు హక్కును వినియోగించుకునేందుకు భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినిగించుకొని ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. ఈ నెల 11 నుంచి 13న సాయంత్రం 6గంటల వరకు జిల్లాలో 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరూ గుంపులు, గుంపులుగా బయట తిరగవద్దన్నారు. సైలెంట్ పీరియడ్ మొదలవుతుందన్నారు. ఎవరూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించకూడదన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు

బోయినపల్లి: జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు చేపట్టి అక్రమంగా తరలించే నగదు, మద్యాన్ని సమర్థవంతంగా అరికట్టాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. శుక్రవారం బోయినపల్లి మండలం కొదురుపాక చెక్ పోస్ట్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ అక్కడ పనిచేస్తున్న సిబ్బంది అక్రమ మద్యం, నగదు రవాణా జరగకుండా పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెక్‌పోస్ట్‌ల వద్ద పనిచేసే అధికారులు మరియు సిబ్బంది పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న మూడు రోజులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేసి ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులు రవాణా జరగకుండా అరికట్టలన్నారు. ఎస్పీ వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పృథ్వీందర్ గౌడ్, సిబ్బంది ఉన్నారు. అనంతరం ఎస్పీ మానువాడ, కోరెం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతీఒక్కరు సహకరించాలని సూచించారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి

కోనరావుపేట/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట/వేములవాడ రూరల్: ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో, వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామాల్లో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులు గ్రామస్థులతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అల్లర్లకు తావు ఇవ్వకుండా నిర్ణీత సమయంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. సోషల్ మీడియాలో విద్వేష పూరిత సందేశాలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనవసరంగా తిరుగవద్దని అన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆయన వెంట వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు, ఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అట్టడుగువర్గాల ప్రజలకు న్యాయం

ఇల్లంతకుంట, మే 10: కాంగ్రెస్‌పార్టీతోనే అట్టడుగువర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ఒగులాపూర్, వెల్జీపూర్, రహీంఖాన్‌పేట తదితర గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావుకు అండగా నిలువాలన్నారు. రాజకీయాల కోసమే కొన్ని పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

చందుర్తి, మే 10: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని చందుర్తి ఎస్సై శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతీఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం

సిరిసిల్ల టౌన్, మే 10: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన బకాయిలను విడదల చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటానికి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ జేఏసీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రావాల్సిన బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం విడదల చేసి ఊరటను ఇచ్చిందన్నారు. గతంలో రూ. 50 కోట్లు, నిన్న రూ. 100 కోట్లతో పాటు కార్మికులకు యారన్ సబ్సిడీ రూ. 9 కోట్లు విడదల చేయడం హర్షనీయం అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, అనుబంధ సంఘాలు, కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటుందని కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు గోలి సత్యనారాయణ, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానలతో మెరుగైన వైద్యసేవలు

ఇల్లంతకుంట, మే 10: పల్లె దవాఖానలతో వైద్యసేవలు మెరుగు అయ్యాయని డీఎంహెచ్‌వో సుమనమోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని గాలిపెల్లిలోని పల్లె దవాఖానలో శుక్రవారం దంతవైద్య శిబిరం నిర్వహించగా 70మందికి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అదనపు వైద్యాధికారి వసంతరావు, ప్రోగ్రాం అధికారి నయింజహ ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా

సిరిసిల్ల కలెక్టరేట్, మే 10: జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ కటారియా అన్నారు. శుక్రవారం సిరిసిల్ల జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఈవీఎం యంత్రాల స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ కటారియా మాట్లాడుతూ జిల్లాలోని సిరిసిల్ల మరియు వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాల ని పేర్కొన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లుకు అభ్యర్థుల గుర్తులు స్పష్టంగా కనపడే విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూము వద్ద సీఆర్పీఎఫ్ భద్రతా దళాల పటిష్ఠ నిఘా ఉండాలని అన్నారు. సీసీ కెమెరాలను, విజిటర్స్, సిబ్బంది విధుల రిజిస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలోని



ఈవీఎం యంత్రాల కేంద్రాలను పరిశీలిస్తున్న అమిత్ కటారియా

అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం చేస్తున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అబ్జర్వర్‌కు క్లుప్తంగా వివరించారు. ముందుగా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఎం సీఎంసీ మీడియా సెంటర్లను పరిశీలించారు. కార్యక్రమాల్లో అదన పు కలెక్టర్ పూజారి గౌతమి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీపీఆర్వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతాన్ని నమోదు చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 10 : సీఈఓ తెలంగాణ రూపొందించిన నూతన యాప్ లో ఓటింగ్ శాతాన్ని నిర్దేశించిన సమయం ప్రకారం నమోదు చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సెక్టార్ ఆఫీసర్స్‌కు సీఈవో తెలంగాణ రూపొందించిన ప్రత్యేక యాప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాప్ డౌన్లోడ్ విధానం, దానిలో వివరాలు నమోదు చేసే పద్ధతిపై వివరించారు. యాప్ వినియోగం, వివరాల నమోదు, మిగితా అంశాలను నోడల్ అధికారి మొహమ్మద్ రఫీ తెలిపారు. సెక్టార్ ఆఫీసర్స్ సందేహాలను నివృత్తి చేశారు. ఇక్కడ వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, సీపీవో శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి దేవేందర్‌రెడ్డి సస్పెన్షన్

ఎల్లారెడ్డిపేట, మే 10: పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నేవూరి దేవేందర్‌రెడ్డిని పదవితో పాటు పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నిబంధనలను అతిక్రమించి వ్యవహరించడం పట్ల క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పార్టీకి నష్టం వాటిల్లే విధంగా ఎవరూ వ్యవహరించిన చర్యలు తప్పవని ప్రతాప రామకృష్ణ స్పష్టం చేశారు.

అధైర్యపడవద్దు.. అండగా ఉంటా

ఎల్లారెడ్డిపేట, మే 10: అధైర్యపడవద్దని.. అండగా ఉంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె తారకరామారావు భరోసా కల్పించారు. మండలంలోని నారాయణపూర్, గొల్లపల్లిలో శుక్రవారం ఆయన పర్యటించారు. నారాయణపూర్‌లో ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం కేటీఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల నిరుపేద అనుప రాజు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన భార్య శిరీష, బాబు మన్విత్, కూతురు మనుశ్రీతో కలిసి కేటీఆర్‌ను కలిశారు. పూట గడవడం కష్టంగా ఉందని కేటీఆర్ ఎదుట కన్నీళ్లు పెట్టుకుంది. ధైర్యంగా ఉండాలని అన్ని విధాలుగా ఆదుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. గొల్లపల్లిలోని బీఆర్ఎస్ నాయకులు పెంజర్ల నారాయణ తండ్రి నాంపల్లి, అందె సురేశ్, వెంకటేశ్‌ల తల్లి రామవ్వలు మృతి చెందగా ఆ కుటుంబాలను కేటీఆర్ పరామర్శించారు. గ్రామంలోని 15 మంది యువకులు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, ఎంపీటీసీలు అపెరాసుల్తానా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నేతన్నలకు ఏం చేశారో సమాధానం చెప్పాలి

సిరిసిల్ల టౌన్, మే 10: ఎన్నికల్లో ఓట్లు అడిగే ముందు సిరిసిల్ల నేతన్నలకు, రైతన్నలకు బీఆర్ఎస్ నాయకులు ఏం చేశారో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. సిరిసిల్ల పట్టణానికి ప్రచారానికి వచ్చే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తమ ప్రశ్నలకు సమాధానం చెప్పి సిరిసిల్లలో ప్రచారం చేయాలన్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గానికి సంబంధించిన 9వ ప్యాకేజీ పనులతో పాటు 10, 11, 12 ప్యాకేజీలను ఎందుకు పూర్తి చేయలేదో కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. 9వ ప్యాకేజీ ద్వారా ముస్తాబాద్, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాలకు రావాల్సిన నీళ్లను రాకుండా చేసి ఈ ప్రాంత రైతన్న, నేతన్నల



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

నోట్లో మట్టి కొట్టాడని ఆరోపించారు. సిరిసిల్ల నేతన్నల రూ. 275 కోట్ల బకాయిలు ఎందుకు చెల్లించలేదో చెప్పాలన్నా రు. ఎన్నికల్లో ఓట్లు అడిగే ముందు సిరిసిల్ల నేతన్నలకు, రైతన్నలకు ఏంచేశావు వీటన్నింటికి సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ సభ్యు డు నాగుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్త విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి

ఎల్లారెడ్డిపేట, మే 10: పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి కార్యకర్త విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని రీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సూచించారు. మీ కష్టం వృథా కావద్దు.. సమయభావం వల్ల రాలేకపోతున్నా.. ఎన్నికల్లో గెలుపు మనదేనని రాజేందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు హాజరు కావాల్సి ఉండగా అత్యవసర సమావేశం ఉండడంతో ఆయన రాలేకపోయారు. కేకే మహేందర్‌రెడ్డికి సెల్‌ఫోన్ చేసి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని కోరారు. మరో రెండు రోజులు శ్రమించి హస్తం గుర్తుకు ఓటు వేసేలా కార్యకర్తలు చూడాలని సూచించారు. అనంతరం పలువురు నాయకులు కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మండలంలోని గొల్లపల్లి, దేవునిగుట్టతండా, తిమ్మాపూర్,



ఓటు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు సోదరి

కోరుట్లపేట, తదితర గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఆయన సోదరి రోహిణి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంచుతూ ఓటు వేయాలని కోరారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో నాయకులు ముస్లీం కమిటీ నాయకుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, లింగాగౌడ్, గౌస్, బుచ్చాగౌడ్, రాములు, రాజేందర్ పాల్గొన్నారు.